నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11కేవీ మల్లాపూర్ బెల్ సబ్‌స్టేషన్ పరిధిలోని బెల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐడీఏ మల్లాపూర్ పారిశ్రామికవాడలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. 11 కేవీ సాయినగర్ ఫీడర్ పరిధి, మల్లాపూర్ ఐడీఏ, 11 కేవీ మల్లాపూర్ ఐడీఏలో 2 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నాచారంలో...

33/11 కేవీ నాచారం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ చందమామా ఫీడర్, 11 కేవీ దుర్గానగర్ ఫీడర్, హర్యానా స్టీల్ ఫీడర్ ముతా మెటల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నాచారం ఏఈ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో నాచారం ఐడీఏ రోడ్డు నెంబర్ 01,09,10,12,13,15,18లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధి

– ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: పార్టీలకు అతీతంగా మల్కాజిగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం అల్వాల్ హిల్స్ సెయింట్ పాయిస్ స్కూల్ వద్ద సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజవకర్గంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. డోలి రమేష్, పరమేష్, లక్ష్మణ్‌యాదవ్, రమేష్, ప్రశాంత్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉషణా స్కూల్ ఆఫ్ డాన్స్ నాట్యాచారిణి యశస్వినీ శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకర్షించింది. శబ్ద వందనం, మహాగణపతిమ్, జతిస్వరం, జయ జయ రామనాథ, లింగాష్టాకం, వినరో భాగ్యం, పలుకే బంగారామయేనా, తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ గీత

ఉప్పల్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని, చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌ముదిరాజ్ అన్నారు. చిలుకానగర్ డివిజన్‌కు చెందిన కొల్లూరి సమ్మమ్మ లంగ్స్ వ్యాధితో ఆసుపత్రిలో చేరింది. ఆమె ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించి, సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా కృషి చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు. నియోజకవర్గంలో పేదలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించినట్లు సమాచారం. బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, కొండల్‌రెడ్డి, జగన్, శ్రీనివాస్, బాలకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ అదృశ్యం



సాయి గంగాధర్

మల్కాజిగిరి: కాంట్రాక్టర్ అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కొండలు తెలిపిన వివరాల ప్రకారం.. వసంతపురికాలనీకి చెందిన సాయిగంగాధర్ (40) సివిల్ కాంట్రాక్టర్. 5 నెలల క్రితం భార్య బంధువుల ఇంటికి వెళ్లి 3 రోజుల్లోనే తిరిగొచ్చింది. ఆమె తిరిగొచ్చినప్పుడు ఇంటికి తాళం వేసి ఉంది. భర్తకు ఫోన్ చేయగా.. 4 రోజుల్లో ఇంటికి వస్తానని సమాధానం చెప్పాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడం, ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ రావడంతో భార్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలోనే కురుమ సంఘం భవనం

ఉప్పల్: త్వరలోనే కురుమ సంఘం భవనం అందుబాటులోకి వస్తుందని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ భరత్‌నగర్‌లో నిర్మిస్తున్న కురుమ సంఘం భవనం రెండో అంతస్తు నిర్మాణానికి శనివారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా కమ్యూనిటీహాళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. కురుమసంఘం రాష్ట్ర కార్యదర్శి గొరిగె మల్లేష్, పెద్ద మల్లేష్, జన్ని రఘు, చిందం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓ వైపు స్పీడ్ బ్రేకర్లు.. మరోవైపు ప్రమాదాలు

- కాలనీవాసులే స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నారని ఆరోపణలు
- కొత్త సమస్యలు ఉత్పన్నమౌతున్న వైనం





కమలానగర్‌లో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు

కాప్రా: సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో ఓ సమస్యకు పరిష్కారం చూపుదామనుకుంటే.. మరో సమస్యను సృష్టిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఏఎస్‌రావునగర్, చర్లపల్లి డివిజన్లలోని పలు కాలనీల్లో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పలువురు కాలనీవాసులే స్పీడ్ బ్రేకర్లు వేసుకుంటున్నారు. కొందరు మైనర్లకు వాహనాలు అప్పగించడంతో కాలనీల్లో కూడా అతివేగంతో వెళ్తున్నారు. చాలా సందర్భాల్లో చిన్నారులు, పాదచారులు అతివేగానికి ప్రమాదాల భారిన పడిన సందర్భాలున్నాయి. రెప్పపాటు వేగంతో వచ్చి ఇలా ఢీకొట్టి అలా వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పలు కాలనీల్లో స్వయంగా వారే స్పీడ్ బ్రేకర్లు వేసుకుని ప్రమాదాల భారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

పట్టించుకోని వాహనదారులు..

కొంతమంది వాహనదారులు స్పీడ్ బ్రేకర్లు ఉన్నా.. వాటిపై నుంచి కూడా అతివేగంగా వెళ్తున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా వేగ నియంత్రణ కోసం స్పీడ్ బ్రేకర్లు వేస్తే కొత్త సమస్య ఉత్పన్నమవుతుంది. కాలనీల్లో స్పీడ్ బ్రేకర్లు ఎక్కువగా ఉండటంతో పలువురు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.

రాత్రికి రాత్రే ఏర్పాటు..

రాత్రికి రాత్రే స్పీడ్ బ్రేకర్లు వేసి వాహనదారుల నడుములు విరిచేస్తున్నారని కొందరు మండిపడుతున్నారు. కాలనీల్లో ఉంటే 1–2 స్పీడ్ బ్రేకర్లు ఉండాలని, గల్లీ, గల్లీకి స్పీడ్ బ్రేకర్లు వేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. మరి ఎక్కడా ఓ చోట వేస్తే.. అక్కడ స్పీడ్ తగ్గించి మళ్లీ వేగం పెంచి ఇష్టానుసారంగా వెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇలా ఓ సమస్యకు చెక్ పెట్టాలనుకుంటే మరో సమస్య ఉత్పన్నమవుతుంది.

ర్యాష్ డ్రైవింగ్‌పై దృష్టిసారించాలి

కొందరు తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు అప్పగించడంతో అతివేగంతో వెళ్తున్నారు. ఇంకొందరైతే స్పీడ్ ఫ్యాషన్ అనుకుని కాలనీల్లోనే మితిమీరిన వేగంతో వెళ్తున్నారు. ఇలాంటి ర్యాష్ డ్రైవింగ్‌పై పోలీసులు దృష్టి సారించకపోవడాన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు ముఖ్యంగా ర్యాష్ డ్రైవింగ్, మైనర్లపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. హెల్మెట్ లేని డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌తో ప్రమాదాలు జరుగుతాయంటున్నారు. చలాన్లకే పరిమితం కాకుండా ఇలాంటి వాటిపై కూడా దృష్టి సారించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మత్స్యకారులకు శాపంగా డెవిల్ చేపలు !

- డెవిల్ చేపలతో నిండిపోయిన చర్లపల్లి చెరువు
- రూ. లక్షల్లో నష్టపోయామంటున్న మత్స్యకారులు



డెవిల్ చేపలను చూపుతున్న మత్స్యకారులు

కుషాయిగూడ: మత్స్యకారుల ఉపాధి కోసం జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన చేపపిల్లల పంపిణీ మత్స్యకారుల పాలిట శాపంగా మారింది. ప్రభుత్వం చెరువులో వేసిన చేప పిల్లల్లో డెవిల్ జాతి చేపపిల్లలు ఉండటంతో చెరువు అంతా డెవిల్ చేపలతో నిండిపోయింది. దీంతో మత్స్యకారులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. మత్స్యకారులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువంతా డెవిల్ చేపలతో నిండిపోయి మిగతా పరకలు, రవ్వలు, బొచ్చెలు వంటి చేపల మనుగడ ప్రశ్నార్థకంగా మార్చేశాయి. తినడానికి పనికి రాని ఈ చేపలు చెరువులో నిండిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని మత్స్యకారులు వాపోతున్నారు. శనివారం చర్లపల్లి చెరువులో మత్స్యకారులు చేపలు పట్టేందుకు వేసిన వలలో 75 శాతానికి పైగా డెవిల్ జాతి చేపలే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జాతి చేపలు మిగతా చేపలకు ఆహారం దొరకనివ్వవని చెప్పారు. ప్రభుత్వం అందజేసే చేపలతో పాటుగా సంఘం తరపున రూ.3 లక్షలు వెచ్చించామన్నారు. చెరువులో వేసిన చేపపిల్లలు కుడా చేతికి రాకుండా పోయాయంటూ ఆవేదన వెలిబుచ్చారు. చెరువును నమ్ముకుని సుమారు 300 మంది మత్స్యకారుల కుటుంబాలు జీవిస్తున్నాయని, ప్రభుత్వం అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని మత్స్యకార సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, ఎంకిర్యాల నర్సింహులు కోరుతున్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



వివేక్ మృతదేహం

మల్లాపూర్: చెట్టుకు ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. న్యూబోయిన్‌పల్లికి చెందిన టీకాబాయి కుమారుడు వీఎస్.వివేక్ (19) మల్లాపూర్ పారిశ్రామికవాడలోని సిగ్మా కంపెనీలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. కాగా 6న ఇంట్లో నుంచి కంపెనీకి వచ్చి, రాత్రి 12 గంటలకు ఇంటికి వస్తానని సహోద్యోగి రవి ఫోన్‌తో తల్లికి ఫోన్‌చేసి చెప్పాడు. తెల్లారిన తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె కంపెనీ యజమాని మహేందర్‌రెడ్డిని అడిగింది. ఇంతలో నాచారం చౌరస్తా బస్‌స్టాప్ వద్ద చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. ఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు చెబుతున్నారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన గణపతి ఆలయ బ్రహ్మోత్సవాలు



పూర్ణాహుతి కార్యక్రమంలో విద్యారణ్య భారతిస్వామి



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: వసంతపురికాలనీలోని వల్లభ గణపతి దేవాలయం 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజున పూర్ణాహుతి, కుంభాభిషేకం, ధ్వజారోహణం, స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు జరిగింది. హంపీ విరూపాక్ష మహాసంస్థాన విద్యారణ్యస్వామి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ మురళీధర్ ఆయనను సన్మానించారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

అల్వాల్: అల్వాల్ హిల్స్‌లోని పద్మావతీ గోదాస మేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మచ్చబొల్లారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్ రావు, నర్సింగ్‌రావు, రమేష్, కిరణ్, ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ అల్వాల్ హిల్స్ సెయింట్ పాయిస్ స్కూల్ వద్ద సీసీరోడ్డు పనులకు శనివారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ నేతలు లక్ష్మీకాంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, మల్లికార్జున్, శ్రీనివాస్, ఉదయ్‌కుమార్, సంపత్, చరణ్, శ్రీనివాస్‌గౌడ్, వినోద్‌యాదవ్, ప్రవీణ్, యూసుఫ్, కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

ఘనంగా బక్రీద్ వేడుకలు



నాచారం ఎస్ఎఫ్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో...

మల్లాపూర్: నాచారం డివిజన్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పక్కన ఉన్న ఎస్ఎఫ్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ వసీమ్ ఉమ్రీ మదాని హఫీజాఉల్లా హాజరై బక్రీద్ విశిష్టతను తెలియజేశారు. అనంతరం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కాప్రా: త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ వేడుకలు కాప్రా సర్కిల్‌లో ఘనంగా నిర్వహించారు. కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి, మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్లలో ఈద్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాప్రా మహమ్మదీయ కాలనీ వద్ద ఉన్న చరిత్రాత్మక ఈద్గాలో ముస్లింలు పెద్ద సంఖ్యలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.



కాప్రా ఈద్గాలో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

త్రిపుర గవర్నర్ పరామర్శ



పద్మారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డి

మల్లాపూర్: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బీజేపీ నేత ఎంపాల పద్మారెడ్డి కుటుంబసభ్యులను త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల సమయంలో పద్మారెడ్డి పార్టీ విజయం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వారి మరణం బాధాకరమన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబసభ్యులకు మనోధైర్యంగా ఉండాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, సత్యనారాయణ, రవినాయక్, మోహన్‌రెడ్డి, బాలచందర్, డివిజన్ అధ్యక్షుడు కొమ్మగళ్ల నవీన్‌కుమార్, రాగిరి మోహన్‌రెడ్డి, ప్రకాష్, రవికాంత్, మంజు, జ్యోతి, లావణ్య తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నేతలు

మల్లాపూర్: నాచారం బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జిల్లా అత్యవసర సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్‌మాదిగ హాజరై మాట్లాడారు. జూలై 7న జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో కమిటీలను వేయాలన్నారు. మందకృష్ణ తన జీవితాన్ని సమాజం కోసం అంకితం చేశారని, ప్రతి సంక్షేమ పథకంలో ఆయన పోరాటం ఉందని, ఆయనకు పద్మశ్రీ రావడం సంతోషకరమన్నారు. జాతీయ కళామండలి అధ్యక్షుడు వై.ఆశోక్‌మాదిగ, జాతీయ నాయకులు రాంచందర్, సీనియర్ నేతలు అంజి, కేశవ్, మహిళా అధ్యక్షురాలు సలోమి, శివ, స్వామి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి

కాప్రా: శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి దృష్టికి తీసుకెళ్లారు. శనివారం కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కార్యదర్శి సుభాష్‌రెడ్డి, సభ్యులు ఠాగూర్, చంద్రమౌళీశ్వరరావు, శంకర్‌రావు, ఇంద్రారెడ్డి, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవం



రామంతాపూర్ : పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక మార్కండేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండా కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా శిరీషాల విజయప్రకాష్, కోశాధికారిగా కొంగరి బాలచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా స్వామి, యాదగిరి, ఏలే రమేష్, జాయింట్ సెక్రటరీలుగా శేఖర్ గజం మురళీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వేణు, నరసింహులు, సహాయ కోశాధికారిగా మురళీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నారాయణదాసు, సురేష్, సలహాదారులుగా రామ్‌నర్సయ్య, రవీందర్, వెంకటయ్య, రాములు, యాదగిరి, చిక్క సత్యనారాయణ తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని ఎలక్షన్ అధికారి అడ్వకేట్ మాచర్ల రంగయ్య సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. తిరందాసు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.